# నాగరికత నవ్వింది



**- రామచంద్రం**

గోపాలం టెరిలిన్ షర్ట్ కొన్నాడు!

నిజమే. జీతం అందుకున్న సాయంత్రం... గుమాస్తా గోపాలం లిబర్టీ టెరిలిన్ షర్ట్ కొన్నాడు! అట్ట పెట్టె అందుకుంటూ ఆనందించాడు. బిల్లు చెల్లిస్తూ భయపడ్డాడు. ఏభై రూపాయల చిల్లర.

అంత ఖరీదు పెట్టి అటువంటి చొక్కా కొనడం గోపాలం జీవితంలో ఇదే మొదటిసారి. పెళ్లికికూడా గజం పదికి మించని సిల్కు చొక్కాయే కుట్టించాడు గోపాలం తండ్రి.

గోపాలానికి పెళ్లి అయింది. 'పెళ్లి చెయ్యి, నాన్నా!' అని అతనేమీ అడగలేదు.

'చెయ్యద్దు, నాన్నా!' అనీ అనలేదు. అదీ గోపాలం తత్త్వమే అంత.

అతనిలో కోర్కెలున్నాయా అంటే త్వరపడి జౌన వేయడం పొరపాటు కావచ్చు. కోర్కెల పుట్టనే మనిషి అనాలని ఎవరయినా గట్టిగా నిర్వచిస్తే, గోపాలాన్ని మనిషి అనడం కష్టం. ఏ కోరికా లేకుండా ఎందుకు బ్రతుకుతున్నావయ్యా అని ఎవరైనా గోపాలాన్ని నిలదీసి అడిగితే, అమాయికంగా ఎటో చూసి, 'ఏమో' అనేసి వెళ్ళిపోతాడేమో? బ్రతుక్కి ఓ ధ్యేయమూ, అర్థమూ ఉండాలనికూడా బహుశా అతనికి తెలీదు. అటువంటి విషయా లతను ఆలోచించగలడా అంటే, అది "కలడు కలండనెడివాడు కలడో లేడో" వంటి ప్రశ్న అయిపోతుంది.

ఏమయితేనేం గోపాలం బ్రతికేస్తున్నాడు. గుమాస్తాగా బ్రతికేస్తున్నాడు. పెద్ద యంత్రంలో కొన్ని చిన్న మరల ప్రయోజనమేమిటో తెలుసుకోగలగడం సామాన్యుడి తరం కాదు. ఆ చిన్ని మరమేకులు ఉండటానికీ, ఉండకపోవడానికీ నడుమ గల తారతమ్యం మామూలు మేథ కందదు.

'ఓ సృష్టికర్తా! గోపాలా న్నెందుకు సృష్టించావయ్యా ఈ ఇరవయ్యో శతాబ్దంలో?' అంటూ ప్రశ్నిస్తే ఓ క్షణం బుర్ర గోక్కోవాలి బ్రహ్మదేవుడు.

గోపాలం బుర్రలో పుట్టిన బుద్ధి కాదిటెరిలిన్ చొక్కా కొనడం.

గోపాలం ఆఫీసరు ధరించేవి టెరిలిన్ షర్టులూ, ట్వీడ్ పాంటూ్ల అన్నది గోపాలం ఎప్పుడూ తెలుసుకోలేదు. ఆఫీసరంటే ఆజ్ఞాపించువాడు. గుమాస్తా అనగా కష్టించి పనిచేయువాడు. ఇదే తెలుసు గోపాలానికి. కాని విషయాలకు పోయే మనిషి కాదు గోపాలం. ఆదివారపు సెలవులు వాడిన దాఖలాలు కూడా అతని రెండేళ్ళ సర్వీసులోను దొరకవు. అత నంత మంచివాడు. అంతమంచివాడూ, అమాయికుడూ అయిన గోపాలం, చాలా కోర్కెలకు అతీతంగా బ్రతికేస్తున్న గోపాలం — అంత ఖరీదైన టెరిలిన్ చొక్కా ఎందుకు కొన్నాడయ్యా అంటే... కారణం కేవలం వరలక్ష్మి. వరలక్ష్మి!

వరలక్ష్మి గోపాలం అర్ధాంగి. అమాయికత్వంలోకూడా అతనికి అనువైన అర్ధాంగే! గంతకు తగ్గ బొంతనే కట్టిపెట్టాడు గోపాలం తండ్రి. అది లేదనికాదీ, ఇది తెండి అనిగానీ వరలక్ష్మి గోపాలా న్నేనాడూ అడిగిన పాపాన పోలే దీ సంవత్సరంలోనూ. పెళ్ళయి సంవత్సరమౌతున్నా గోపాలం మునపటి బ్రతుక్కీ, ఇప్పటి బ్రతుక్కీ పెద్ద తేడా కానరావడం లేదు. ఎటొచ్చీ తెచ్చిన జీతాన్ని అందుకుందుకు అప్పుడు తండ్రి ఉండేవాడు. ఇప్పుడు వరలక్ష్మి అందుకుని అతనికి కావలసినవి అమర్చుతూంది.

వరలక్ష్మిది విచిత్రమైన అమాయికత్వం. అది పుట్టుక పుట్టిందన్నమాటే కాని కించిదసూయ తప్ప తన నగలకోసమూ, చీరెల కోసమూ అమాయికపు మొగుణ్ణి అర్థించడమే తెలియదు.

ఆ కాస్త అసూయా... స్త్రీ సహజంగా సంతరించుకుంది కనక, వరలక్ష్మి పక్కింటి అన్నగారిని చూసి, తన భర్తని టెరిలిన్ షర్టు కొనుక్కోమంది. సరిగ్గా అటువంటి పొడుగు చేతుల నీలంచొక్కాయే కొనుక్కోమంది.

ఎదురుచెప్పే స్వభావం కానేకాదు గోపాలానిది. మనసులో మనసై, బ్రతుకులో బ్రతుకైన అర్ధాంగి అలా ప్రాధేయపడేసరికి ఆలోచించకుండానే తల ఊపి అంగీకారం తెలిపేశాడు. చేసిన వాగ్దానాన్ని భంగపరచగలిగే ధైర్యం గోపాలానికి లేదు. సాధ్యాసాధ్యాల ప్రమేయం లేకుండానే ఎవరైనా చెప్పాలే తప్ప, చెయ్యకపోవడం గోపాలం తరం కాదు. అందుకే, "గోపాలం, నిన్ను గుమాస్తాగా పుట్టించిన విధాత చాలా అభినందనీయుడు" అంటూ ఉంటా డతని ఆఫీసరు.

నోరు తెరవడంలాగే ఒళ్ళు దాచుకోవడమూ తెలీని గోపాలంకంటె అనువైన గుమాస్తా ఇంకెవ రుండగలరు?

తన బాధ్యత తీరిపోయిందన్నట్లు అట్టిపెట్టి, మిగిలిన జీతమూ వరలక్ష్మి కిచ్చేసి, వాలుకుర్చీలో కూలబడిపోయాడు.

---

అతనిలో కోర్కెలు ఉన్నాయా అంటే త్వరపడి జౌనవేయడం పొరపాటు కావచ్చు. కోర్కెల పుట్టనే మనిషి అనాలని ఎవరైనా గట్టిగా నిర్వచిస్తే గోపాలాన్ని మనిషి అనడం కష్టం. 'ఓ సృష్టికర్తా! గోపాలాన్నెందుకు సృష్టించావయ్యా — ఈ ఇరవయ్యో శతాబ్దంలో?' అంటూ ప్రశ్నిస్తే ఓ క్షణం బుర్రగోక్కోవాలి బ్రహ్మదేవుడు!

---

అతనా చొక్కా వేసుకుంటే చూడాలని వరలక్ష్మికి ఉబలాటం లేకపోలేదు. కాని, అప్పటికి చీకటి పడిపోయింది కనక తన కోరిక, ఆత్రత మరునాటి ఉదయంవరకూ వాయిదావేసుకుంది.

ఆ రాత్రి వరలక్ష్మి కలలో పక్కింటి అన్నగారితో పాటు తన భర్తకూడా నీలంచొక్కా వేసుకుని, అతనికంటె వెయ్యి రెట్లు వెలిగిపోతున్నట్లే కనిపించాడు.

వరలక్ష్మి కలలకు ఫుల్‌స్టాప్ పెడుతూ రేయి తెల్లవారింది; పొద్దెక్కింది.

---

## ఊహల పల్లకి

### మసూనా

అదిగో అదిగో
ఊహల పల్లకి!

యువతీ యువకుల అనురాగాలలో
నవజీవన మనోహర గాథలు,
రాత్రుల వెన్నెల తరగలలో
రమ్యమౌ మధుర స్వప్నములూ
॥అదిగో॥

దేశం కోసం పాటుపడే
ఆశాజీవి గుండెల్లో
పొంగే రక్తపు సెగలో పగలో
పొంచిన మించిన కథలెన్నో
॥అదిగో॥

జీవన శ్రుతిలో, మధుర స్మృతిలో
చింతల పొలిమేరలలో కాంతులు,
ఆశయాల సంగ్రామ కేళిలో
అజేయమౌ యువ జీవన గాథలు

అదిగో అదిగో
ఊహల పల్లకి॥ ★


వాయిదాలమీద ట్రాన్సిస్టర్

ప్రపంచప్రసిద్ధమైన నేషనల్ — 70
3 బాండ్ల, అఖిల ప్రపంచ, పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను గ్యారంటీతో నెలసరి రు. 10/-ల వాయిదాలమీద పొందండి. ప్రతి పల్లెకు, బస్తీకి పంపవచ్చును. దిగువ అడ్రసుకు వ్రాయండి:



MUSIC & SOUND (APW-10)
P.B. 1576, Delhi-6.



పండిత డి. గోపాలాచార్యులవారి
బాలప్రాశ
బిడ్డలకు
రుచికరమైన టానిక్కు
1898నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
100 జి ఎన్ రోడ్ మదరాసు 17

ఊళ్ళో వడారి షాపువాడికి అప్పు తీర్చేందుకు వెళ్ళిన గోపాలం తిరిగి వచ్చేందుకు కొంచెం ఆలస్యమే అయింది.

అతను గుమ్మంలో అడుగు పెట్టడమే తడవుగా అందమైన అట్టపెట్టెలోంచి అంతకంటె అందమైన టెరిలిన్ చొక్కా గోపాలాని కందించి, "త్వరగా తొడుక్కుని వెళ్లి మా బావగారికి చూపించి రండి". అంటూ తరిమింది వరలక్ష్మి.

అతనలా వెళ్లాడో లేదో పాలవాడు వచ్చాడు. ఇంటి యజమాని వచ్చాడు. గోపాలం మంచితనంమీద వాళ్లకి నమ్మకం తక్కువని కాదు. జీతం వచ్చిన మరునాడే తను బాకీలు పూర్తిగా చెల్లు వేస్తాడని గోపాలంమీద వాళ్లకి చాలా అభిమానం.

పాలవాడిని, ఇంటాయనని పంపేసింది.

పనిమనిషి, మానెమనిషి వచ్చి నిలుచున్నారు.

వరలక్ష్మి తెల్లబోతూ చూసింది వారి వంక.

అల్మైరా దగ్గరగా వెళ్లి అక్కడ నిలబడిపోయింది.

ఇంతలో గోపాలం తిరిగి వచ్చేశాడు.

వరలక్ష్మి ముఖం అతనికి కనపడటం లేదు.

"చూడు... ఈ చొక్కా చాలా బాగుందిట కాని..."

వెనక్కి తిరిగి చూసిం దామె.

"ఇలాంటి పొడుగు చేతుల చొక్కా బయట వేసు కోరట. మంచి ఖరీదైన పాంటులో దోపుకుంటె తప్ప పనికిరాదుట. ఇలాగే బయటకు వెడితే నలుగురూ నవ్వుతారుట. ఏం చేద్దామంటావు?" అమాయికంగా అడుగుతూ నిలుచున్నాడు గోపాలం.

"ఖరీదైన పాంటు కావాలా?... అవును... ఇలా ఏమీ బాగులేదు. నిజమే..."

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి.

హఠాత్తుగా ఏదో ఆవేశమూ, ఆలోచనా కలిగినట్లు మంగళసూత్రాలు రెండూ తీసి భర్త చేతిలో పెట్టి, రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడవసాగింది.

అర్థంకాని పనిమనిషీ, మానెవాడూ "మళ్లీ వస్తాంలెమ్మా" అంటూ వెళ్లిపోయారు.

* * *

"చూడండి, నిజంగా నా కేమీ తెలియదు. చిన్న పొరపాటున... పొరపాటున... తెలియక తీసుకున్నాను... ఏమీ మాయలేదు. అట్టపెట్టెకూడా చూడండి... మరకయినా పడలేదు కదూ?

చొక్కా తీసేసుకోండి. నాకు... మంచి పాంటు లేదు. ఈ చొక్కామీద వేసుకుందుకు మంచి పాంటుం దనుకుని..."

అందరూ గోపాలాన్నే చూస్తున్నారు.

"నిజంగా నాకు తెలీక తీసుకెళ్లాను. వాపస్ తీసుకోరూ? ఖరీదైన పాంట్ కొనుక్కుందును కానీ... అమ్మో... అంత డబ్బు ఖర్చుచేస్తే జీతంతో నెల గడవదు."

షాపులో బాయ్ మొదలు మానేజరు వరకూ ఫక్కున నవ్వా రొక్కసారి.

గోపాలాని కా నవ్వులు వినిపించడం లేదు. వరలక్ష్మి వెక్కిళ్లే వినిపిస్తున్నాయి.

గోపాలానికి షాపువాళ్లందరూ తన నెలా చూస్తున్నారో కనిపించడం లేదు. అతని కళ్ల ముందు వరలక్ష్మి కన్నీరే కనిపిస్తోంది.

ఓ జంతువుని...సర్కస్‌లో జంతువుని చూసినట్లే చూస్తున్నారు షాపువాళ్లు గోపాలాన్ని.

"రెండు రూపాయలు తగ్గించాల్సి ఉంటుంది." చిట్టచివరకు వరమిచ్చే వేల్పులా అన్నాడు మానేజరు, షాపులో అందరూ పది నిమిషాలపాటు ఉచితంగా వినోదించగలిగిన అనంతరం.

"స...రే..." అంతకంటె ఏమీ అనలేక పోయాడు గోపాలం.

డబ్బు తీసుకుని మెట్లు దిగుతున్న గోపాలాన్ని తడబడుతున్న అతని అడుగులను, పిరామరకల చొక్కా గోనెలా వేలాడుతున్న పంట్లాన్ని, జోళ్లులేని పాదాలను మామూలు క్రాపింగ్‌ని చూస్తూ మళ్లీ అందరూ నవ్వుకుంటున్నారు.

నాగరికులు నవ్వుతున్న నవ్వులు గోపాలానికి వినిపించడం లేదు.

తన కోసం ఆత్రంగా ఎదురుచూస్తూ వరలక్ష్మి పిలుస్తున్నట్లే వినిపిస్తోంది అతని హృదయంలో.

నాగరికత నవ్వి నవ్వి అలిసిపోయేను గోపాలం ఇల్లు చేరుకున్నాడు. వరలక్ష్మి అతని గుండెలమీద పడి నేరం చేసినదానిమల్లే భోరున ఏడ్చింది. ❩

# "శాంతి దీపం - వింత దీపం"

—★—

## బెళ్లూరి శ్రీనివాసమూర్తి

శాంతి దీపం — శాంతి దీపం
సంతాపం తొలగించే సంతమసం సమయించే
శాంతి దీపం — వింత దీపం —
హృదయమనే ప్రమిదలోన ప్రేమ తైల ధార నింపి
జ్ఞానమనే వత్తిపైన తానుగ వెలిగే దీపం
శాంతి దీపం — శాంతి దీపం —

విశ్వాన్నే వెలిగించే విమలమైన దీ దీపం
శాశ్వత సుఖనందాయిని సత్యమైన దీ దీపం
అంతరంగమున దీపం
ఆరిపోని దీ దీపం
ఇరుగుపొరుగు వారింటికి ఎదురింటికి నీ దీపం
విరజిమ్మును చిరుకాంతుల వేదసదృశ మీ దీపం —
శాంతి దీపం — కాంతివంతం

నవ్యమైన దీ దీపం భవ్యమైన దీ దీపం
దివ్యమైన దీ దీపం అవ్యయమైనది దీపం
అంతటా వెలిగేటి దీపం —
శాంతి దీపం — సత్య దీపం — వింత దీపం —
కావ్యగతమై వెలుగు దీపం రామణీయక మొలుకు దీపం
కామితార్థము లిచ్చు దీపం గమ్యమును జేర్చేటి దీపం
శాంతి దీపం — శాంతి దీపం —

తలచి మనమును తట్టిలేపే తత్త్వసుందరమైన దీపం
తప్తజీవుల కెల్ల మదిలో ధైర్యసారము పోయు దీపం
కానరాని పదార్థ సమితిని కనుల నిల్పే నిత్యదీపం
తాను తానై వెలుగు దీపం
ధర్మదీపం — శాంతి దీపం! ★